కిరణ్ టైప్ ఇన్‌స్టిట్యూట్

శ్రీ శంకరాచార్య విరచిత

- శ్రీ ఆనంద లహరి -



సేకరణ: కిరణ్ టైప్ ఇనిస్టిట్యూట్,
41-1/8-13A.,గౌతమీనగర్,3వ లైను, కృష్ణలంక, విజయవాడ-520 013.
https://madhirafamily.wordpress.com/

Kiron Type Institute

శ్రీ ఆనందలహరి స్తోత్రమ్

01. భవాని స్తోతుం త్వాం ప్రభవతి చతుర్భిర్న వదనైః
ప్రజానామీశాన స్త్రిపుర మథనః పంచభిరపి।
నషడ్భిః స్సేనానీర్దశ శతముఖై రప్యహిపతిః
తదాన్యేషాం కేషాం కథయ కథమస్మిన్ నవసరః॥

అమ్మా భవానీ, సమస్త లోకాలను సృష్టించిన బ్రహ్మ దేవుడు తన నాలుగు ముఖాలతోనూ, త్రిపురాసురులను సంహరించిన ఈశ్వరుడు తన అయిదు ముఖాలతోనూ, దేవతల సర్వ సైన్యాధ్యక్షుడైన షణ్ముఖుడు తన ఆరు ముఖాలతోనూ, ఆదిశేషుడు తన వేయి ముఖాలతోనూ నీ మహిమను కీర్తించలేకపోతే, ఇక సామాన్య మానవుడను నేను ఎంతటి వాడను తల్లీ.

ఓ జగదేకమాత భవానీ – సృష్టికర్త బ్రహ్మ తన నాలుగు ముఖాలతోను, త్రిపురహరుడు శంకరుడు తన అయిదు ముఖాలతోను, దేవసేనాని కుమారస్వామి తన ఆరు ముఖాలతోను, నాగరాజైన ఆదిశేషుడు తన వేయి ముఖాలతోను నీ మహిమా పాఠవాలను వర్ణింపలేకున్నారు. ఇక మానవ మాత్రుడను నే నెంతటి వాడను.

02. ఘృత క్షీర ద్రాక్షా మధు మధురిమా కైరపి పదైః
విశిష్యా నాఖ్యేయో భవతి రసనామాత్ర విషయః।
తథా తే సౌందర్యం పరమశివ దృఙ్మాత్ర విషయః
కథంకారం బ్రూమః సకల నిగమా గోచరగుణే॥

ఘృతము, క్షీరము, ద్రాక్షరసము, తేనె వంటి పదార్థాలలోని మాధుర్యమును వర్ణించడానికి ఎన్ని మాటలైనా సరిపోవు. కేవలము నాలుకకు మాత్రమే ఆ రుచి తెలుసు. నీ సౌందర్యమును వేదములే వర్ణించలేక పోయాయి. నీ సౌందర్యము కేవలము ఈశ్వరునికే తెలుసు గానీ, మాబోటి సామాన్యులు తెలుసుకోగలరా!

నెయ్యి, పాలు, ద్రాక్షా - తేనెలలోని మాధుర్యాన్ని వర్ణించేందుకు మాటలు చాలవు. వాటి రుచి నాలుకకు మాత్రమే తెలుసు. అమ్మా నీ సౌందర్యం వర్ణించాలంటే సకల వేదాలకే శక్తి చాలదే - ఆ సౌందర్యాతిశయం మహేశ్వరునికి ఎరుకగానీ - మా బోటి సామాన్యుల తరమా తల్లీ!

03. ముఖే(ఖా) తే తాంబూలం నయన యుగళే కజ్జలకలా
లలాటే కాశ్మీరం విలసతి గళే మౌక్తిక లతా।
స్ఫురత్కాంచీ శాటీ పృథు కటితటే హాటకమయీ
భజామి త్వాం గౌరీం నగపతి కిశోరీమ విరతమ్॥

నోటిలో సుగంధపూరితమైన తాంబూలము, కళ్ళకు అందమైన కాటుక, ఫాలభాగమున సింధూరము, గళమున ముత్యాల హారము, బంగారు జరీతో నేసిన చీర, కటి భాగమున రత్నాలు కూర్చిన వడ్డాణముతో, గౌర వర్ణముతో మెరిసిపోతున్న ఓ పర్వతరాజపుత్రీ, ఎల్లప్పుడూ మదిలో నిన్ను స్మరిస్తాను.

నోట్లో తాంబూలం, కళ్ళకు కాటుక, నొసట సిందూర తిలకం, మెడలో మంచి ముత్యాల హారం, బంగారు జలతారుతో నేయబడిన చీరె, నడుమున రత్నాలు తాపిన వడ్డాణాన్ని ధరించి; ధగధగ మెరిసే వేష భూషణాలతో విరాజిల్లే గిరిరాజనందినీ! గౌరవర్ణినీ! సదా మనసా నిన్నే ఆరాధిస్తాను తల్లీ!

04. విరాజన్ మందారద్రుమ కుసుమ హారస్తన తటీ
నదద్వీణా నాదశ్రవణ విలసత్ కుండల గుణా।
నతాంగీ మాత(తా)ంగీ రుచిర గతిభంగీ భగవతీ
సతీ శంభో రంభోరుహ చటుల చక్షుర్విజయతే॥

గళములో మందార పుష్పముల మాలను ధరించి, వీణా నాదము యొక్క మాధుర్యాన్ని ఆలకిస్తూ, మెరుస్తున్న కర్ణాభరణముల కాంతులతో, వంగిన కటి భాగముతో, ఆడ గజము వంటి నెమ్మదైన నడకతో, కలువలవంటి నేత్రములతో, మంగళకరమైన, ఈశ్వరుని దేవేరివైన నీ రూపమే నా కనులలో కదలాడుచున్నది.

మందారకుసుమ మాల ధరించి హృదయసీమను మధుర వీణానాదాన్ని ఆలకిస్తూ - చెవుల తళతళ మెరిసే కుండల కాంతుల శోభతో - వయ్యారంగా వంగిన తనువుతో, ఆడయేనుగు అందమైన నడకతో - మనోహరమైన మందగమనంతో, కలువకన్నుల మంగళస్వరూపిణీ! హే భగవతీ శంకరసతీ - సర్వత్ర నీరూపమే నాకు కనులముందు కదులాడుతోంది తల్లీ!

05. నవీనార్క భ్రాజన్మణి కనక భూషణ పరికరైః
వృతాంగీ సారంగీ రుచిర నయనాంగీ కృతశివా।
తటిత్పీతా పీతాంబర లలిత మంజీర సుభగా
మమాపర్ణా పూర్ణా నిరవధిసుఖైరస్తు సుముఖీ॥

అమ్మా! నీ శరీరమున ప్రకాశిస్తున్న స్వర్ణాభరణముల కాంతి అప్పుడే ఉదయిస్తున్న సూర్యుని కాంతివలె, సుందరమైన నీ నేత్రములు ఆడు లేడి కనులవలే అత్యంత సుందరముగా ఉన్నవి. పసుపు పచ్చని శరీర వర్ణముతో పట్టు

పీతాంబరములను ధరించి, పాదములకు నూపురములతో ప్రకాశించే ఈశ్వర పత్నీ, నాకు నిత్యానందమును ప్రసాదించుము.

హే జగన్మాతా! అపుడే ఉదయించిన బాలభానునిలా దేదీప్యమానంగా ప్రకాశించే సువర్ణ మణిమయాది భూషణాలతో సర్వాంగ భూషితవు. ఆడులేడి కళ్ళవంటి అత్యంత సుందరమైన కన్నులు గలదానవు. పరమశివుని పతిగా స్వీకరించినదానవు. మెరుపులాంటి పచ్చని మేనికాంతికలదానవు. పసిడి పీతాంబరం, పాదమంజీరాలతో కలకల్లాడే అయిదవరాలా ఆనందస్వరూపిణీ! అపర్ణా - నిరంతరం నాకు నిండుగా ఆనందాన్ని యిమ్ము తల్లీ!

06. హిమాద్రేః సంభూతా సులలితకరైః పల్లవయుతా
సుపుష్పా ముక్తాభిర్భ్రమరకలితా చాలకభరైః।
కృతస్థాణుస్థానా కుచఫలనతా సూక్తిసరసా
రుజాం హంత్రీ గంత్రీ విలసతి చిదానందలతికా॥

ఆ తల్లి జ్ఞానము, ఆనందము అనే లతలుగా, మంచు పర్వతములలో ఉద్భవించి, పల్లవములవంటి అరచేతులతో, పూలనే ముత్యాల సరములుగా కలిగి, తుమ్మెదలవంటి కురులతో, స్థన ఫలముల యొక్క భారముతో వంగి ఉన్నది. తేనెలూరు మాటలతో, ఆ తల్లి సర్వ రోగములను నివారిస్తూ కలుషములను హరిస్తూ, చిదానంద స్వరూపిణిగా ఉన్న మాతను స్మరిస్తున్నాను.

ఆ మాత జ్ఞానలత, ఆనందలత, మంచుకొనలోపుట్టినది. అందమైన అరచేతులనే పల్లవాలు కలది. ముత్యాల సరాలనే పూలుపూసింది. నల్లని తుమ్మెద దలనే ముంగురులతో ముచ్చటగొలిపేది. స్థన ఫలభారంతో వంగినటువంటిది. సరస వాక్కుల తేనె లొలికించునట్టిదా లత. సర్వరోగ నివారిణి, కలుషహారిణి - అది జ్ఞానానందలతిక - శివమనోవల్లరి.

07. సపర్ణామాకీర్ణాం కతిపయగుణైః సాదరమిహ
శ్రయంత్యన్యే వల్లిం మమ తు మతిరేవం విలసతి।
అపర్ణైకా సేవ్యా జగతి సకలైర్యత్పరివృతః
పురాణో౽పి స్థాణుః ఫలతి కిల కైవల్యపదవీమ్॥

అపర్ణను వివాహమాడిన ఈశ్వరుడు, మనందరికీ మోక్షఫలమును ప్రసాదిస్తున్నాడు. అదేవిధముగా మనందరము కూడా ఈ ఐహిక ప్రపంచములో తరించాలంటే కేవలము అపర్ణను మాత్రమే కొలిచి ఆరాధించాలి కానీ సపర్ణను మాత్రం కాదు.

ఇహంలో తరించాలంటే అపర్ణనే కొలవాలి కాని సపర్ణను కాదు. ఆ అపర్ణను పరిణయమాడిన పరమశివుడు మోక్షఫలప్రదాత అయ్యాడు కదా!

08. విధాత్రీ ధర్మాణాం త్వమసి సకలామ్నాయజననీ
త్వమర్థానాం మూలం ధనదనమనీయాంఘ్రికమలే।
త్వమాదిః కామానాం జనని కృతకందర్పవిజయే
సతాం ముక్తేర్బీజం త్వమసి పరమబ్రహ్మమహిషీ॥

జగన్మాతా! వేదములన్నీ నీలోనుండే ఉద్భవించాయి. వేదములు నిర్దేశించిన రీతిగా ఈ విశ్వమును నడుపుదానవు నీవు. కుబేరుడు నీ పాదదాసుడు. సమస్త కోరికలను ఈడేర్చే కామేశ్వరివి, ఈశ్వరుని దేవేరివి, ధర్మార్థకామ మోక్షములను, ముక్తిని ప్రసాదించుదానవు నీవు.

ఓ జగదేకమాతా! వేదాలన్నీ నీలోనే జనించాయి. సకల వేద విధులను విధించుదానవు నీవే. ధనాధిపతి కుబేరుడు కూడా నీ పాదాక్రాంతుడే. నీవు కామేశ్వరివి. కోరికలు తీర్చేదానవు. కాముని జయించిన దానవు. పరబ్రహ్మ

స్వరూపుని పట్టపురాణివి గదమ్మా! సజ్జనుల ముక్తికి కారణభూతురాలవు. ధర్మ అర్థ కామ మోక్షాలనే చతుర్విధ పురుషార్థములను ఇచ్చేదానవు నీవే తల్లీ!

09. ప్రభూతా భక్తిస్తే యదపి న మమాలోలమనస-
స్త్వయా తు శ్రీమత్యా సదయమవ లోక్యోఽహమధునా।
పయోదః పానీయం దిశతి మధురం చాతకముఖే
భృశం శంకే కైర్వా విధిభిరనునీతా మమ మతిః

చంచలమైన నా మనసును నీయందు నిలుపలేకున్నాను. ఎందుకు నా మనసును నిలుపలేకున్నానో నాకు తెలియటం లేదు. పెద్ద మనసున్న నీవే నన్ను దయచూడాలి. మేఘము చాతకపక్షి నోట జలబిందువులను కురిపించినట్లే, నీవు నాపై దయారసవృష్టిని కురిపించాలి.

చపలచిత్తుడనైన నాకు నిజం చెప్పాలంటే నీయందంతగా భక్తి కుదరడం లేదు. కానీ నీవు పెద్ద మనస్సున్నదానవు. - శ్రీమతివి. నీవే నన్నిపుడు దయచూడాలి తల్లీ. చాతకపక్షి ఇష్టాయిష్టాలకు అతీతంగా మేఘుడు చాతకపక్షినోట తీయటి జలాలను కురిపించటం లేదా! అలాగే దయావర్షం నాపై కురిపించు తల్లీ! ఎందువల్ల నా మనస్సు నీ యందు నిలకడ కోల్పోతోందో అని సతతము మథన పడుతున్నాను తల్లీ.

10. కృపాపాంగాలోకం వితర తరసా సాధుచరితే
న తే యుక్తోపేక్షా మయి శరణదీక్షాముపగతే।
న చేదిష్టం దద్యాదనుపదమహో కల్పలతికా
విశేషః సామాన్యైః కథమితరవల్లీపరికరైః॥

జగన్మాతా! కపటమెరుంగని నీవు, శరణన్న వారిని కరుణించే తల్లివి. కోరిన వరాలనిచ్చే మాతవు. నాకు వరములను ప్రసాదించక ఉపేక్షిస్తే, నీకూ అన్య దేవతలకు భేద మేముంటుందమ్మా!

అమ్మా నీవు కపట మెరుగని సచ్చరిత్రవు గదమ్మా! నీ కృపాదృష్టిని నాపై త్వరగా ప్రసరింపజేయుము తల్లీ! నిన్ను శరణు కోరినవారిని కరుణించే కల్పవల్లివి గదమ్మా - నన్ను ఉపేక్షించకమ్మా! అడిగిందే తడవుగా వరాలిచ్చే కల్పవల్లీ! ఈయకుంటే సామాన్య లతకు కల్పలతకు తేడా ఏముంటుంది తల్లీ.

11. మహాంతం విశ్వాసం తవ చరణ పంకే రుహాయుగే
నిధాయాన్యన్నైవాశ్రితమిహ మయా దైవతముమే।
తథాపి త్వచ్చేతో యది మయి న జాయేత సదయం
నిరాలంబో లంబోదరజనని కం యామి శరణమ్॥

జగన్మాతా ఉమాదేవీ, నాకు ఏ ఆధారమూ లేదు. నేను నీ పాదములనే ఆశ్రయించాను. మరే దేవతలను ఆశ్రయించలేదు. నీవు నాపై దయ చూపకపోతే, నాకు ఆశ్రయము ఉండదమ్మా. ఓ లంబోదర జననీ నిన్ను తప్ప ఎవరిని నన్ను శరణు వేడమంటావు.

అమ్మా ఉమాదేవీ! నీ పాదపద్మాలనే నమ్ముకున్నా నమ్మా. ఇతర దేవతల నాశ్రయించాలను కోలేదు. అయినా నాపై నీకు దయరాకపోతే, నేను నిరాశ్రయుడనై పోతానమ్మా. హే లంబోదర జననీ ఏ యాధారమూ లేని నన్ను ఎవరిని శరణు వేడుకోమంటావు తల్లీ.

12. అయః స్పర్శే లగ్నం సపది లభతే హేమపదవీం
యథా రథ్యాపాథః శుచి భవతి గంగౌఘమిలితమ్।

కిరణ్ టైప్ ఇన్‌స్టిట్యూట్

తథా తత్తత్వాపైరతిమలినమంతర్మమ యది
త్వయి ప్రేమ్ణాసక్తం కథమివ న జాయేత విమలమ్॥

అమ్మా! పరుసవేది లేదా స్పర్శవేదిని తాకగానే, ఇనుము బంగారముగా మారుతుంది. గంగా నదిలో కలిసినపుడు మురికి కాలువలోని నీరు కూడా పరిశుద్ధ జలమవుతుంది. ఈ ప్రాపంచిక మాయలో చిక్కి మలినమైన నా మనసు మాత్రం పవిత్రమైన నీ భక్తి భావముతో కలిసినపుడు నిర్మలం కాకుండా ఉంటుందా తల్లీ.

అమ్మా! స్పర్శవేది సోకగానే ఇనుము బంగార మవుతుంది. వీధి కాల్వల్లో పారే మురికినీరు గంగతో కలసి పునీతం అవుతుంది. అదే విధంగా మాయను జిక్కి పాపాలతో మలినమైపోయిన నా మనస్సు - భక్తిభావనలో మునిగినపుడు అది మాత్రం నిర్మలం కాకపోతుందా తల్లీ.

13. త్వదన్యస్మాదిచ్ఛా విషయఫలలాభే న నియమ-
స్త్వమర్థా(జ్ఞా)నా మిచ్ఛాధికమపి సమర్థా వితరణే।
ఇతి ప్రాహుః ప్రాంచః కమలభవనాద్యాస్త్వయి మన-
స్త్వదాసక్తం నక్తం దివ ముచితమీశాని కురు తత్॥

అమ్మా ఈశానీ! నిన్ను తప్ప నేను మరి ఏ అన్య దేవతలనూ ఆరాధించను. వారిని ఆరాధించినంత మాత్రమునే కోరికలు తీరుతాయన్న నమ్మకమూ లేదు. నీవు మాత్రం మేము కోరిన కోరికలన్నీ సహృదయంతో అనుగ్రహిస్తావు. బ్రహ్మాది దేవతలందరూ కూడా ఈ విషయాన్నే స్పష్టం చేశారు. నాకేమి కావాలో నీకు తెలుసు కాబట్టి వాటినే నీవు అనుగ్రహించు.

ఓ ఈశ్వరీ నిన్ను కాదని అన్యదేవతలను వేడను. వేడినంత మాత్రాన కోరిన కోర్కెలన్నీ తీరుతాయనే నమ్మకము లేదు. అదే నీవైతే - తెలియని మూర్ఖులు

తమ శక్తికి మించి కోరిన కోరికలు కూడ నిండు మనసుతో తీరుస్తావు. ఇది బ్రహ్మాదులు చెప్పిన సత్యం. హే జగన్మాతా నా మనస్సు రేయింబవళ్ళు నీ పైనే లగ్నమైంది తల్లీ. - ఇప్పుడు నాకేది ఉచితమని భావిస్తావో దానిని అనుగ్రహించు తల్లీ.

14. స్ఫురన్నానారత్న స్ఫటిక మయభిత్తి ప్రతిఫల-
త్త్వదాకారం చంచచ్ఛశధరకలా సౌధశిఖరమ్।
ముకుంద బ్రహ్మేంద్ర ప్రభృతి పరివారం విజయతే
తవాగారం రమ్యం త్రిభువన మహారాజ గృహిణి॥

మూడు జగములకు నాయకుడైన ఈశ్వరుని ప్రియదేవేరియైన ఓ మాతా! స్ఫటికములు, మణులతో కూర్చబడిన గోడలలో అన్ని వైపుల నీ రూపమే కనబడుతోంది. చంద్రుడు నీ సౌధమును ప్రకాశమానం చేస్తున్నాడు. ఇంద్రుడు, బ్రహ్మ, విష్ణువు మొదలైనవారితో నీ దివ్య భవనము కళకళలాడుతోంది.

త్రిభువన నాయకుడైన పరమేశ్వరుని పట్టపురాణివైన జగజ్జననీ! నీ భవనమెంతో రమ్యమైనది. రత్న ప్రాకారాలతో, స్ఫటిక మణిమయ గోడలతో, అన్నిటా నీ రూపమే ప్రతిబింబిస్తూ కనులకింపుగావుంది. నీ సౌధశిఖరం చంద్రుని కాంతులతో మిలమిల మెరిసిపోతున్నది. విష్ణువు, బ్రహ్మ, ఇంద్రాది దేవతా పరివారంతో నీ భవనం ఎంత మహోజ్జ్వలంగా ఉన్నది తల్లీ.

15. నివాసః కైలాసే విధిశతమఖాద్యాః స్తుతికరాః
కుటుంబం త్రైలోక్యం కృతకరపుటః సిద్ధినికరః।
మహేశః ప్రాణేశస్తదవనిధరాధీశతనయే
న తే సౌభాగ్యస్య క్వచిదపి మనాగస్తి తులనా॥

ఓ పర్వతరాజపుత్రీ! భవానీ! నీ నివాసమైన కైలాసం ఒక రజత పర్వతము. బ్రహ్మ మొదలైన దేవతలు నీ గుణములను గానం చేస్తుంటారు. ఈ ముజ్జగములు నీ పరివారమే. అణిమాది అష్టసిద్ధులు నీ ముందు అంజలి మోడ్చి నిలబడి ఉంటాయి. జగన్నాథుడైన మహేశ్వరుడే నీ ప్రియనాథుడు. ఇంక నీ భాగ్యమును ఏమని చెప్పాలి తల్లీ.

మాతా! పర్వతరాజకుమారీ – మాతా భవానీ! నీ నివాసం కైలాసం. రజతగిరి అనబడే వెండి కొండ. – బ్రహ్మేంద్రాదులు నీ గుణగానం చేసే వైతాళికులు – ముల్లోకాలు నీ కుటుంబమే. – అణిమాది అష్టసిద్ధులు అంజలి ఘటించి నీ యెదట నిలబడి ఉన్నాయి. మహేశ్వరుడు నీ ప్రాణనాథుడు. నీ సౌభాగ్యానికి సాటి ఎక్కడుంది తల్లీ!

16. వృషో వృద్ధో యానం విషమ శనమాశా నివసనం
శ్మశానం క్రీడాభూర్భుజగనివహో భూషణవిధిః।
సమగ్రా సామగ్రీ జగతి విదితైవ స్మరరిపో–
ర్యదేతస్యైశ్వర్యం తవ జనని సౌభాగ్యమహిమా॥

అమ్మా! కామదేవుడైన మన్మధుని కాల్చి బూడిద చేసిన ఈశ్వరుని వాహనము ఒక ముసలిదైన ఎద్దు. ఆయన ఆహారం గరళము. ఆయన సంచరించేది శ్మశానములో. ధరించే ఆభరణములు సర్పములు. ఇవీ ఆయన ఆస్తిపాస్తులు. విభూతి ధారణ చేసే శివుడు ఇతరులకు మాత్రం ఐశ్వర్యాన్ని ప్రసాదించగలుగుతున్నాడంటే, అది నీ సౌభాగ్య మహిమవలననే కదా తల్లీ.

అమ్మా! మన్మథుని బూడిదచేసిన ఆ శంకరుని వాహనమా ముసలి ఎద్దు – ఆహారమా విషము – కట్టుపుట్టములా దిక్కులు – విహార భూమి స్మశానవాటిక – సొమ్ములా పాముల తుట్టెలు – ఆయనకున్న భాగ్యమేపాటిదో

ఎల్లలోకాలు ఎరిగినదేగదా! అయినప్పటికి ఆయన మహా ఐశ్వర్యవంతుడు – తాను బూడిద పూసుకున్నా ఇతరులకు భూతి నివ్వగల సుసంపన్నుడు. దీనికి నీ సౌభాగ్యమహిమే కారణం తల్లీ.

17. ఆశేష బ్రహ్మాండ ప్రలయవిధి నైసర్గికమతిః
శ్మశానేష్వాసీనః కృతభసితలేపః పశుపతిః
దధౌ కంఠే హాలాహల మఖిల భూగోల కృపయా
భవత్యాః సంగత్యాః ఫలమితి చ కల్యాణి కలయే॥

జగన్మాతా! దేహమంతా విభూతి ధారణ చేసి, శ్మశాన సంచారియైన శివుని అందరూ లయకారునిగా భావిస్తారు. కానీ ఆ శివుడే కాలకూట విషమును తన కంఠములో నిలిపి సకల లోకములను రక్షించాడూ అంటే, అదంతా సర్వమంగళవైన నీ తాటంకముల మహిమే కదా తల్లీ.

హే మంగళ ప్రదాయినీ! కళ్యాణీ! దేహమంతా విబూది పూసుకుని స్మశానంలో తిష్ఠవేసి కూర్చునే శివుడు సర్వలోకాలకు సంహారకర్త అని ప్రళయం కలిగిస్తాడని పేరు. – కానీ, ఆ శివుడే సకల జీవరాసులను కాపాడాలని కాలకూట విషాన్ని మ్రింగి కంఠాన బెట్టుకుని, సమస్త భూగోళాన్ని దయామయుడై కాపాడంటే – అదంతా నీ చలవే – సర్వమంగళదాయినీ – నీతోడి సాంగత్యమే అందుకు కారణమని భావిస్తున్నాను తల్లీ!

18. త్వదీయం సౌందర్యం నిరతిశయమాలోక్య పరయా
భియైవాసీద్గంగా జలమయతనుః శైలతనయే।
తదేతస్యాస్తస్మాద్వదనకమలం వీక్ష్య కృపయా
ప్రతిష్ఠామాతన్వన్నిజ శిరసివాసేన గిరీశః॥

జగన్మాతా! అతిలోక సౌందర్యవతివైన నిన్ను చూసి, సౌందర్యవతియైన గంగామాత ఆవిరైపోయి నీరుగా మారిపోయింది. గంగాదేవి దీనస్థితిని గమనించిన ఈశ్వరుడు, ఆమెపై జాలిపడి, తన జటాజూటములో స్థానం కల్పించి, గౌరవమును ఆపాదించాడు.

ఆమ్మా శైలపుత్రీ! సర్వోత్కృష్టమైన నీ సౌందర్య గరిమను చూసి భయంతో బెదిరిపోయి గంగ నీరైపోయింది. అంతట ఈశ్వరుడు ఆ గంగాదేవి ముఖకమలాన్ని చూసి, ఆ గంగ దీనావస్థకు జాలిపడి, దయతలిచి, తన శిరసున నివాసమిచ్చి, ప్రత్యేక ప్రతిష్టను కల్గించాడు.

19. విశాలశ్రీఖండ ద్రవమృగ మదాకీర్ణఘుసృణ
ప్రసూనవ్యామిశ్రం భగవతి తవాభ్యంగసలిలమ్।
సమాదాయ స్రష్టా చలితపదపాంసూన్నిజకరైః
సమాధత్తే సృష్టిం విబుధపురపంకేరుహ దృశామ్॥

ఆమ్మా! నీకు ఒక విషయం తెలుసా – గంధము, కుంకుమ పూవు, కస్తూరి కలిపి నీవు చేసే అభిషేక స్నాన జలమును బ్రహ్మదేవుడు స్వీకరించి, ఆ జలములో నీయొక్క పాదధూళిని మిళితము చేసి, అనేకమంది సుందరమైన స్త్రీ మూర్తులను దేవలోకములో సృష్టిస్తున్నాడు.

హే భగవతీ! మంచిగంధపు రసం, కస్తూరి, కుంకుమ పూవుతో కూడిన నీ తలంటి స్నానజలాన్ని, నీ పాదరజాన్ని బ్రహ్మదేవుడు స్వయంగా తన చేతులతో గ్రహించి ఆ స్నాన జలంలో నీ పాద ధూళిని కలిపి పదునుచేసి దేవలోకంలో కలువరేకుల వంటి కన్నులు గల కాంతామణులను సృష్టిస్తున్నాడు తల్లీ!

కిరణ్ టైప్ ఇన్స్టిట్యూట్

20. వసంతే సానందే కుసుమితలతాభిః పరివృతే
స్ఫురన్నానాపద్మే సరసి కలహంసాలిసుభగే।
సఖీభిః ఖేలంతీం మలయపవనాందోలితజలే
స్మరేద్యస్త్వాం తస్య జ్వరజనిత పీడాపసరతి॥

మాతా! సుగంధపూరితమైన పుష్పములు కల లతలతో, అనేక పద్మములతో, రాజహంసలు సంచరించే సుందర సరోవరములో, మందముగా గాలులు వీస్తుండగా, నెమ్మదిగా కదలుతున్న సరోవర జలాలలో సహచరులతో కలసి జలక్రీడలు చేస్తున్న నిన్ను మానసికముగా ధ్యానించినవారికి ఎటువంటి జ్వరములు, వ్యాధులు దరిచేరవు.

తల్లీ జ్వరబాధ శాంతించాలంటే, ఆనందదాయకమైన వసంత ఋతువులో – విరబూసిన లతలతో – వికసించిన పద్మాలతో కలహంసల బారులతో కలకల్లాడే సరోవరంలో – మలయ పవన వీచికలతో మెల్లిమెల్లిగా కదులుతున్న జలాల్లో చెలులతో జలక్రీడలు చేస్తున్న జగన్మాతను ధ్యానించిన వారికి జ్వరపీడ తొలగిపోతుంది.

// ఇతి శ్రీమచ్ఛంకరాచార్యవిరచిత ఆనందలహరీ సంపూర్ణమ్ //

– – – = – – –



(ఎక్కడైనా తప్పులు ఉంటే సహృదయంతో తెలియజేయవలసినదిగా మనవి.-944 044 9650, 994 994 1430)